నిమ్మధరలు పొదలకూరు (కిలో)



సన్నవి: రూ. 25
పెద్దవి: రూ. 45
పండ్లు: రూ. 8

హ్యాండ్ బాల్ రాష్ట్ర జట్టుకు ఎంపిక

కందుకూరు రూరల్: హ్యాండ్ బాల్ రాష్ట్ర జట్టుకు స్థానిక టీఆర్ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ఎంపికై నట్లు ప్రిన్సిపల్ కె.నాగేశ్వరరావు శుక్రవారం తెలిపారు. ఈ నెల 16 నుంచి కర్నూలులో జరిగిన రాష్ట్ర స్థాయి హ్యాండ్ బాల్ పోటీల్లో ఉమ్మడి ప్రకాశం జిల్లా బాలికల జట్టు ఫైనల్స్‌లో ద్వితీయస్థానం సాధించింది. జట్టులో ప్రతిభ కనబరిచిన పి.శాంతి, బాలుర విభాగంలో కె.వెంకటసాయిలను రాష్ట్ర జట్టుకు ఎంపిక చేశారని, వీరు త్వరలో హర్యానాలో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో ఆంధ్ర జట్టు తరఫున పాల్గొంటారని తెలిపారు.

జనవరి కల్లా టిడ్కో గృహాల పంపిణీ

• ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి

నెల్లూరు(బారకాసు): నెల్లూరు రూరల్ నియోజకవర్గంలోని మున్సిపల్ కార్పొరేషన్ డివిజన్ల పరిధిలో టిడ్కో గృహాల్లో అన్ని మౌలిక వసతులు కల్పించి వచ్చే ఏడాది జనవరి చివరి కల్లా లబ్ధిదారులకు అందజేసేలా చర్యలు చేపట్టాలని నెల్లూరు ఎంపీ, వైఎస్సార్‌సీపీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆదాల ప్రభాకర్‌రెడ్డి అధికారులకు సూచించారు. శుక్రవారం ఎంపీ ఆదాల నెల్లూరు నగరపాలక సంస్థ కార్యాలయాన్ని సందర్శించి మేయర్ స్రవంతి జయవర్ధన్, కమిషనర్ వికాస్‌మర్మత్‌లతో వివిధ అభివృద్ధి పనులపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ టిడ్కో గృహాలను లబ్ధిదారులకు అందించే ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. మరో రూ.80 కోట్ల వ్యయంతో నెల్లూరు నగరాభివృద్ధికి ప్రయత్నిస్తున్నామన్నారు. మేయర్ మాట్లాడుతూ నగరపాలక సంస్థ పరిధిలో ప్రజలకు మెరుగైన సేవలందించేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. కమిషనర్ వికాస్‌మర్మత్ మాట్లాడుతూ ఎంపీ, మేయర్ సూచనల మేరకు టిడ్కో గృహ సముదాయాల్లో అన్ని మౌలిక సదుపాయాలు కల్పించి జనవరిలో లబ్ధిదారులకు అందించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనంతరం నెల్లూరు నగర మేయర్‌గా రెండేళ్ల పదవీకాలం పూర్తి చేసుకున్న సందర్భంగా మేయర్ స్రవంతి జయవర్ధన్‌ను ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి అభినందించారు.

యువకుడి అనుమానాస్పద మృతి



వెంకటేశ్వర్లు మృతదేహం

పొదలకూరు: పట్టణానికి సమీపంలో లింగంపల్లితోపునకు చెందిన యువకుడు సోమశిల మార్గంలో కల్వర్టు వద్ద అనుమానాస్పద స్థితిలో మృతిచెంది ఉండడాన్ని శుక్రవారం స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు, స్థానికుల వివరాల మేరకు.. దాచూరు వెంకటేశ్వర్లు(28) మద్యం దుకాణానికి సమీపంలో మెయిన్‌రోడ్డు కల్వర్టు కింద పడి ఉండడాన్ని స్థానికులు గుర్తించారు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని బయటకు తీసి విచారించగా లింగంపల్లితోపునకు చెందిన వెంకటేశ్వర్లుగా గుర్తించారు. వెంకటేశ్వర్లు ఓ హత్య కేసులో నిందితుడు(ఏ7) కావడంతో పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. అయితే కల్వర్టు దిమ్మెపై కూర్చుని వెంకటేశ్వర్లు మద్యం తాగి తూలి పడిపోయి ఉంటాడని కూడా భావిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నెల్లూరు జీజీహెచ్‌కు తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఎన్నికల ముందు హడావుడి హాస్యాస్పదం

• నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): గత ఎన్నికల తర్వాత ఎక్కడా కనపడని మాజీ మంత్రి పొంగూరు నారాయణ ప్రస్తుతం ఎన్నికలు సమీపిస్తుండడంతో హడావుడి చేస్తూ కనిపించడం హాస్యాస్పదంగా ఉందని నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్ అన్నారు. శుక్రవారం నెల్లూరు నగరంలోని 52వ డివిజన్ రంగనాయకులపేట రైలుకట్ట వీధి, గొల్లవీధి తదితర ప్రాంతాల్లో ఎమ్మెల్యే అధికారులతో కలిసి పర్యటించారు. స్థానిక సమస్యలను ప్రజలను అడిగి తెలుసుకుని వెంటనే పరిష్కరించాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానిక డివిజన్‌లో దాదాపు అన్ని పనులు పూర్తి చేసుకున్నామని, ఓ రెండు అభివృద్ధి పనులు టెండర్లకు వెళ్లాయని, అవి కూడా త్వరలో పూర్తి చేస్తామని తెలిపారు. దశాబ్దాలుగా చేయని రోడ్లు, డ్రెయిన్ల పనులను కూడా తమ ప్రభుత్వంలో చేస్తున్నామన్నారు. వర్షాలు వస్తుండడంతో టీడీపీ నాయకులంతా అప్రమత్తంగా ఉండాలంటూ రెండు రోజుల క్రితం మాజీ మంత్రి నారాయణ మాట్లాడినట్లు సోషల్ మీడియాలో చూశానని, గత నాలుగున్నరేళ్లుగా కనిపించని ఆయన ప్రస్తుతం ఎన్నికలు సమీపిస్తుండడంతో మళ్లీ కనిస్తున్నారని అన్నారు. 2024 ఎన్నికలు అయ్యాక మళ్లీ నారాయణ ఎక్కడుంటారో కూడా ఎవరికీ తెలియదన్నారు. ఎన్నికల సమయంలో నాయకులు, కార్యకర్తలను నమ్మని నారాయణ జీతాలు ఇచ్చి సొంత సిబ్బందిని ఎన్నికల కోసం ఏర్పాటు చేసుకునే పరిస్థితికి వచ్చారన్నారు. స్థానికంగా ప్రజలకు ఏవైనా సమస్యలుంటే నాయకులకు చెప్పుకుంటారు గానీ నారాయణ సిబ్బందికి ఎలా చెప్పుకుంటారో అర్థం కావడం లేదన్నారు. వలంటీర్లు ప్రభుత్వ సేవలు అందించేందుకు ఇంటింటికీ వెళుతుంటే ప్రజల డేటా సేకరిస్తున్నారని నిందలు వేసిన టీడీపీ నాయకులు, ప్రస్తుతం నారాయణ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి వివరాలు అడగడం ఎంతవరకు సమంజసమని ఎమ్మెల్యే ప్రశ్నించారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ఎండీ ఖలీల్ అహ్మద్, కార్పొరేటర్ షేక్ అస్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నేతలతో అప్రమత్తంగా ఉండాలి

• ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి

కోవూరు(బుచ్చిరెడ్డిపాళెం): 2024 ఎన్నికల నేపథ్యంలో టీడీపీ నాయకులు పగటి వేషగాళ్లుగా గ్రామాలపై పడ్డారని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి అన్నారు. బుచ్చిరెడ్డిపాళెంలోని 13, 16 వార్డుల్లో శుక్రవారం నిర్వహించిన 'ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే' కార్య క్రమం అనంతరం ఎమ్మెల్యే విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బుచ్చిరెడ్డిపాళెం 5వ సచివాలయం పరిధిలో రూ.27.44 కోట్ల సంక్షేమ పథకాల నిధులు లబ్ధిదారుల ఖాతాల్లో ప్రభుత్వం జమ చేసిందని తెలిపారు. కరోనా కష్ట కాలంలో టీడీపీ, జనసేన పగటి వేషగాళ్లు ఎక్కడికి వెళ్లారో ప్రజలకు చెప్పాలన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కులమతాలు, రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా సంక్షేమ ఫలాలను అందిస్తున్నారని తెలిపారు. ప్రస్తుతం ఎన్నికలు సమీపిస్తుండడంతో కల్లబొల్లి మాటలు చెప్పి ప్రజలను మోసం చేసేందుకు టీడీపీ నేతలు బయలుదేరారన్నారు. రానున్న ఎన్నికల్లో నెల్లూరు ఎంపీగా పోటీ చేస్తున్న వేమి రెడ్డి ప్రభాకర్‌రెడ్డిని, కోవూరు ఎమ్మెల్యేగా తనను గెలిపించుకోవడంతోపాటు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోమారు ముఖ్యమంత్రిగా చేసుకుందామని పిలుపునిచ్చారు.

రూ.కోటితో సీసీ రోడ్డు నిర్మాణం

బుచ్చిరెడ్డిపాళెంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద నుంచి ఆంజనేయ స్వామి ఆలయం వరకు రూ.కోటి నుడా నిధులతో సీసీ రోడ్డు నిర్మిస్తామని ఎమ్మెల్యే తెలిపారు. అందుకు సంబంధించి మరో 10 రోజుల్లో టెండర్ల ప్రక్రియ పూర్తిచేసి పనులు ప్రారంభిస్తారన్నారు. కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్‌పర్సన్ మోర్ల సుప్రజ, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మల్లికార్జునరెడ్డి, జొన్నవాడ కామాక్షితాయి ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ సుబ్రహ్మణ్యం నాయుడు, విజయభాస్కర్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, సీతారామిరెడ్డి, మోర్ల మురళి, కౌన్సిలర్లు లక్ష్మీకాంతమ్మ, ప్రమీలమ్మ, భరత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

నెల్లూరు(వీఆర్సీసెంటర్): జిల్లాలో విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నేతలు కోరారు. ఈ మేరకు ఎస్పీడీసీఎల్ జిల్లా సర్కిల్ ఎస్ఈ విజయన్, విద్యుత్ శాఖ విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులురెడ్డికి వినతిపత్రాలను శుక్రవారం అందజేశారు. యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి సుమన్, యూనియన్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు దుగ్గిరాల సూరిబాబు, జిల్లా అధ్యక్షుడు కృష్ణ, నేతలు శ్రీనివాసులు, రాజమోహన్ తదితరులు పాల్గొన్నారు.

స్వాధీనం చేసుకున్న క్యాటిఫిష్‌ల పూడ్చివేత

నెల్లూరు రూరల్: మూడో మైలు వద్ద అక్రమంగా తరలిస్తున్న నిషేధిత క్యాట్ ఫిష్‌లను మత్స్యశాఖ అధికారులు అడ్డుకొని రూరల్ పోలీసులకు అప్పగించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో వీటిని సమీపంలోని దొరతోపు సంఘం వద్ద ప్రభుత్వ భూమిలో శుక్రవారం పూడ్చిపెట్టారు. రూరల్ తహసీల్దార్ సోమ్లానాయక్, రూరల్ ఎస్సై స్వప్న తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు పౌల్ట్రీ సోసియేషన్ ధరలు



బ్రాయిలర్ (లైవ్)	: రూ.90
లేయర్ (లైవ్)	: రూ.105
బ్రాయిలర్ చికెన్	: రూ.168
స్కిన్‌లెస్ చికెన్	: రూ.188
లేయర్ చికెన్	: రూ.178





అరాచకాలు, దౌర్జన్యాలను ఉపేక్షించేదిలేదు

• ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి

నెల్లూరు రూరల్: అరాచకాలు, దౌర్జన్యాలను తాను ఏ మాత్రం సహించబోనని ఎంపీ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నెల్లూరు రూరల్ నియోజకవర్గ సమన్వయకర్త ఆదాల ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. 26వ డివిజన్లో రూ.85 లక్షలతో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనను శుక్రవారం చేపట్టిన అనంతరం ఆయన మాట్లాడారు. ప్రజలను ఇబ్బంది పెట్టే కార్యక్రమాన్ని తానెప్పుడూ చేయలేదని చెప్పారు. అవాస్తవాలను సోషల్ మీడియా ద్వారా వ్యాప్తి చేసి ఎదుటివారి మనోభావాలను దెబ్బతీయడం మంచి పద్ధతి కాదని హితవు పలికారు. తన 25 ఏళ్ల రాజకీయ జీవితాన్ని ప్రజాసేవకే అంకితం చేశానని తెలిపారు. తానెక్కడ పనిచేసినా, ఆ ప్రాంత ప్రజలు ఆశీర్వదిస్తారే తప్ప వ్యతిరేకించరని చెప్పారు. తాను ఎవరిపైనా ఇప్పటి వరకు ఒక్క పోలీస్ కేసును పెట్టలేదని వివరించారు. సీఎం జగన్మోహన్‌రెడ్డి పేదలు, మహిళల పక్షపాతి అని తెలిపారు. 26వ డివిజన్ అభివృద్ధిని దృష్టిలో ఉంచుకొని మరో కోటిన్నరను మంజూరు చేస్తామని వెల్లడించారు. రానున్న ఐదేళ్లలో డివిజన్‌కు రూ.10 కోట్లను మంజూరు చేసి అభివృద్ధి కార్యక్రమాలను చేపడతామని ప్రకటించారు. రానున్న ఎన్నికల్లో పార్టీని అఖండ మెజార్టీతో గెలిపించాలని కోరారు. మేయర్ స్రవంతి, విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఆదాల ప్రభాకర్‌రెడ్డి

నంబర్ వన్‌గా తీర్చిదిద్దుతా..

నెల్లూరు రూరల్: నెల్లూరు రూరల్ నియోజకవర్గాన్ని అన్ని విధాలా అభివృద్ధి చేసి నంబర్ వన్‌గా తీర్చిదిద్దుతానని ఎంపీ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త ఆదాల ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. 23వ డివిజన్లోని ఇందిరమ్మ కాలనీలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని శుక్రవారం ఆయన నిర్వహించారు. తమ ప్రాంతానికి విచ్చేసిన ఎంపీకి ప్రజలు ఘన స్వాగతం పలికారు. అనంతరం గడప గడపకూ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ఆయన వివరించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డితో చర్చించి నియోజకవర్గంలో వివిధ అభివృద్ధి పనుల కోసం రూ.50 కోట్లను మంజూరు చేయించామని తెలిపారు. రానున్న రెండు, మూడు నెలల్లో ఈ డివిజన్‌కు మరో రూ.నాలుగు కోట్లను మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. ఎంపీ ల్యాడ్స్ ద్వారా కేటాయించిన రూ.పది కోట్లనూ నియోజకవర్గ అభివృద్ధికే వినియోగిస్తామన్నారు. మేయర్ స్రవంతి, కార్పొరేటర్ శ్రీనివాసులురెడ్డి, విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి, పుల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎంపీ ఆదాల

నారాయణ వ్యాఖ్యలు హాస్యాస్పదం


అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న అనిల్‌కుమార్

• ఎమ్మెల్యే అనిల్‌కుమార్

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): నాలుగున్నరేళ్ల పాటు పత్తాలేని టీడీపీ నేత నారాయణ ప్రస్తుతం నగరానికి వచ్చి తామే అభివృద్ధి చేశామని చెప్పుకోవడం విడ్డూరంగా ఉందని నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్ విమర్శించారు. నాలుగో డివిజన్లోని జాకీర్‌హుస్సేన్‌నగర్‌లో గల న్యూ కాలనీ, మెయిన్ రోడ్డుకు సంబంధించి రూ.80 లక్షలతో చేపట్టనున్న పనులకు శంకుస్థాపనను శుక్రవారం నిర్వహించిన అనంతరం ఆయన మాట్లాడారు. పనులు పెండింగ్‌లో లేకుండా పూర్తి చేస్తామని వెల్లడించారు. డివిజన్లో ఇప్పటి వరకు దాదాపు 100 విద్యుత్ స్తంభాలను మార్చడంతో పాటు నూతనంగా వేశామని.. మరో 60 స్తంభాలను త్వరలో ఏర్పాటు చేయనున్నామని తెలిపారు. మైపాడు రోడ్డు పనులను దాదాపు పూర్తి చేశామని, సెంట్రల్ లైటింగ్‌కు టెండర్లను పిలిచామన్నారు. జాఫర్‌సాహెబ్ కాలువ వద్ద రూ.1.7 కోట్లతో పార్కును అభివృద్ధి చేస్తున్నామని పేర్కొన్నారు. నూతనంగా నిర్మిస్తున్న పెన్నా బ్రిడ్జి పనులు పూర్తయితే స్థానిక డివిజన్లు ఎంతో అభివృద్ధి చెందుతాయని తెలిపారు. ఇప్పటి వరకు నగరంలోని రోడ్లను తామే అభివృద్ధి చేశామనే రీతిలో నారాయణ మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. గత ప్రభుత్వ హయాంలో ఎంత అభివృద్ధి జరిగింది... తమ ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధిపై చర్చకు రావాలని ఆయన్ను ఆహ్వానిస్తే, రాననడం హాస్యాస్పదమన్నారు. డిప్యూటీ మేయర్ ఖలీల్ అహ్మద్, కార్పొరేటర్ పోలంరెడ్డి లక్ష్మీప్రత్యూష తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

అతి వేగం తగదు


కౌన్సెలింగ్ ఇస్తున్న అబ్దుల్ సుభాన్

నెల్లూరు(క్రైమ్): అతి వేగం ప్రమాదాలకు కారణమవుతోందని ట్రాఫిక్ డీఎస్పీ అబ్దుల్ సుభాన్ పేర్కొన్నారు. విశాఖపట్నం ఘటన నేపథ్యంలో నగరంలోని సర్వోదయ కళాశాలలో ఆటో డ్రైవర్లకు శుక్రవారం నిర్వహించిన కౌన్సెలింగ్‌లో ఆయన మాట్లాడారు. నిబంధనలను తప్పక పాటించాలని ఆదేశించారు. పాఠశాలలకు విద్యార్థులను ఇష్టానుసారంగా తీసుకెళ్లరాదని చెప్పారు. ఆటోలపై స్పెషల్ డ్రైవ్ కొనసాగుతుందని, నిబంధనలను ఉల్లంఘిస్తే కేసులు తప్పవని హెచ్చరించారు. సౌత్ ట్రాఫిక్ సీఐ వేమారెడ్డి, ఎస్సై వెంకట్రావు, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్సీపీ హయాంలో సంక్షేమం



నెల్లూరు రూరల్: గతంలో ఎన్నడూ లేని విధంగా నెల్లూరు రూరల్ నియోజకవర్గంలో అభివృద్ధితో పాటు అర్హులకు సంక్షేమ పథకాలను అందించిన ఘనత ప్రస్తుత ప్రభుత్వానికే దక్కుతుందని జేసీఎస్ నెల్లూరు రూరల్ మండల కన్వీనర్ ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. ఏపీకి జగనే ఎందుకు కావాలి కార్యక్రమాన్ని కందమూరులోని సచివాలయంలో శుక్రవారం నిర్వహించారు. అనంతరం పార్టీ పతాకాన్ని ఆవిష్కరించారు. పార్టీ రూరల్ మండల కన్వీనర్ రామ్‌ప్రసాద్‌రెడ్డి, రూరల్ ఎంపీపీ విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ కళాశాల నుంచి ర్యాలీ



నెల్లూరు సిటీ: వైద్యులను సంప్రదించకుండా యాంటీబయోటిక్స్‌ను ఎట్టి పరిస్థితుల్లో వినియోగించకూడదని ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వసుంధర పేర్కొన్నారు. నగరంలోని ప్రభుత్వ మెడికల్ కళాశాల నుంచి ర్యాలీని శుక్రవారం నిర్వహించారు. హాస్పిటల్ సూపరింటెండెంట్ చంద్రశేఖర్‌నాయుడు, వైస్ ప్రిన్సిపల్ గోవింద్, డిప్యూటీ సూపరింటెండెంట్ మస్తాన్‌బాషా, మెడిసిన్ ప్రొఫెసర్ నరేంద్ర, మైక్రోబయాలజీ చీఫ్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

పలు డివిజన్లలో 'ఏపీకి జగనే ఎందుకు కావాలి'



నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): 'ఏపీకి జగనే ఎందుకు కావాలి' కార్యక్రమాన్ని నగరంలోని పలు డివిజన్లలో శుక్రవారం నిర్వహించారు. అనంతరం పార్టీ జెండాను ఆవిష్కరించారు. నగరంలోని మూడో డివిజన్ రామయ్యవీధి సచివాలయ పరిధిలో కార్పొరేటర్ సంక్రాంతి అశ్విని.. పదో డివిజన్లోని రామచంద్రాపురం సచివాలయ పరిధిలో కార్పొరేటర్ కిన్నెర ప్రేమ్‌కుమార్.. తదితరుల ఆధ్వర్యంలో కార్యక్రమాలను జరిపారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం



నెల్లూరు(బృందావనం): ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి తల్లి ఆదాల సుశీలమ్మ రెండో వర్ధంతిని శుక్రవారం నిర్వహించారు. బాలాజీనగర్‌లోని గీతామయి వృద్ధాశ్రమంలో అన్నదానాన్ని విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి ప్రారంభించారు. తొలుత సుశీలమ్మ చిత్రపటానికి నివాళులర్పించారు. పాశం శ్రీనివాస్, హరిబాబుయాదవ్, నెల్లూరు పవన్‌కుమార్‌రెడ్డి, సన్నపురెడ్డి వెంకటసుబ్బారెడ్డి, ఆశ్రమ నిర్వాహకుడు తమ్మినేని పాండు తదితరులు పాల్గొన్నారు.

ఆర్బీకేల్లో రైతులకు శిక్షణ



నెల్లూరు రూరల్: వరిసాగులో అధిక దిగుబడులు సాధించే విత్తనాలను రైతులు వాడాలని కృషి విజ్ఞాన కేంద్ర శాస్త్రవేత్త కిరణ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. ఆమంచర్ల, సౌత్‌మోపూరు గ్రామాల్లోని ఆర్బీకేల్లో రైతులకు శిక్షణ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. రూరల్ మండల వ్యవసాయాధికారి నాగమోహన్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్లపై నీరు నిల్వ ఉండకూడదు

నెల్లూరు(బారకాసు): రోడ్లపై వర్షపునీరు నిల్వ ఉండకుండా తగు చర్యలు చేపట్టాలని కమిషనర్ వికాస్ మర్మత్ ఆదేశించారు. కేవీఆర్ పెట్రోల్ బంక్ కూడలి, ఆర్టీసీ, వీఆర్సీ, గాంధీబొమ్మ, కనకమహల్, ఏసీ సెంటర్ తదితర ప్రాంతాల్లో పారిశుధ్య పనులను శుక్రవారం పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. కాలువల్లో పూడికతీత పనులను చేపట్టాలని సూచించారు. ఇంటింటి చెత్త సేకరణ వాహనాలకు మాత్రమే వ్యర్థాలను అందించాలని కోరారు. బహిరంగ ప్రదేశాల్లో చెత్తను వేస్తే జరిమానాలు విధిస్తామని స్పష్టం చేశారు. తడి, పొడి చెత్తను వేర్వేరుగా అందజేయాలని పేర్కొన్నారు. బహిరంగ ప్రదేశాల్లో చెత్తను వేయరాదనే విషయమై అవగాహన కల్పిస్తూ.. సచివాలయాల పరిధిలోని ప్రతి ఇంటికీ నోటీసులను అందించాలని కార్యదర్శులను ఆదేశించారు. ఎంహెచ్‌ఓ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.


రోడ్డుపై పేరుకుపోయిన మురుగును పరిశీలిస్తున్న వికాస్ మర్మత్

సీఎంను కలిసిన రూప్‌కుమార్‌యాదవ్



నెల్లూరు(దర్గామిట్ట): తాడేపల్లిలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేత నాగార్జునయాదవ్ వివాహానికి హాజరైన సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్‌యాదవ్ మర్యాదపూర్వకంగా శుక్రవారం కలిశారు. ఆప్యాయంగా పలకరించి క్షేమ సమాచారాన్ని అడిగి తెలుసుకున్నారు.

జెడ్పీ ఉద్యోగులకు దంత పరీక్షలు

నెల్లూరు (పొగతోట): నగరంలోని జెడ్పీ కార్యాలయంలో దంత వైద్యశిబిరాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురికి వైద్య పరీక్షలు చేశారు. జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, సీఈఓ చిరంజీవి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని పలు సబ్‌స్టేషన్లలో మరమ్మతుల కారణంగా వివిధ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా శనివారం ఉండదని నెల్లూరు టౌన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సోమశేఖర్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వైఎమ్సీఏ సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ దర్గామిట్ట ఫీడర్‌లో మరమ్మతుల కారణంగా శోధన్‌నగర్, అరవిందనగర్, ఆర్టీసీ బస్టాండ్, జిల్లా కోర్టు పరిసర ప్రాంతాల్లో ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరా ఉండదని చెప్పారు.

➡ రాజేంద్రనగర్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ వాకర్స్ రోడ్డు ఫీడర్‌లో మరమ్మతుల కారణంగా పొర్లుకట్ట, పుత్తా ఎస్టేట్స్, మనుమసిద్ధి నగర్, రాజేంద్రనగర్ తదితర ప్రాంతాల్లో ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరా ఉండదని పేర్కొన్నారు.

నెల్లూరు రూరల్: కొత్తూరు సబ్‌స్టేషన్ పరిధిలోని కొత్తూరు, శ్రామికనగర్, చంద్రబాబు నగర్, అంబాపురం, అక్కచెరువుపాడు, వైఎస్సార్‌నగర్, కావేరినగర్, పోలీస్‌కాలనీ తదితర ప్రాంతాల్లో ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం 12 వరకు సరఫరా ఉండదని ఏఈ శివశంకర్ పేర్కొన్నారు.

ముగిసిన దళిత డప్పుల మేళా



నెల్లూరు(బృందావనం): నగరంలోని పురమందిరంలో రాష్ట్ర సాంస్కృతిక శాఖ సౌజన్యంతో, ప్రజాజ్యోతి చైతన్య కళావేదిక జిల్లా శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జగనన్న దళిత డప్పుల మేళా శుక్రవారంతో ముగిసింది. జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన జానపద, డప్పు, కోలాటం, నాటక తదితర రంగాలకు చెందిన 80 మంది కళాకారులకు మహాకవి గుర్రం జాషువా ప్రతిభ పురస్కారాలను అందజేశారు. సమాచార, పౌరసంబంధాల శాఖ డిప్యూటీ డైరెక్టర్ సదారావు, ప్రజాజ్యోతి చైతన్య కళావేదిక రాష్ట్ర అధ్యక్షురాలు రమణశ్రీ, జీవనజ్యోతి స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు వెంకట్రావ్, బాబు, జానపద కళావేదిక నెల్లూరు అధ్యక్షుడు చక్రపాణి తదితరులు పాల్గొన్నారు.

కనులపండువగా తులసీ, దామోదర కల్యాణం


సీతారామస్వామి మందిరంలో..


అష్టలక్ష్మి మందిరంలో..

నెల్లూరు(బృందావనం): చిలుక ద్వాదశిని పురస్కరించుకొని బాలాజీనగర్‌లోని సీతారామస్వామి మందిరంలో తులసీ, దామోదర కల్యాణోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో శుక్రవారం నిర్వహించారు. మందిర కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు అమర్తలూరు వెంకటేశ్వర్లుగుప్తా, సోమిశెట్టి వెంకటరత్నం, కోశాధికారి తన్నీరు మస్తాన్‌రావు తదితరులు పర్యవేక్షించారు.

➡ సుజాతమ్మ కాలనీలోని కృష్ణ యోగ మందిర ప్రాంగణంలో గల అష్టలక్ష్మి మందిరంలో తులసీ, దామోదర కల్యాణాన్ని వేడుకగా నిర్వహించారు. గణపతి సచ్చిదానంద కృష్ణజ్ఞాన బోధ సభ ట్రస్ట్ ఎగ్జిక్యూటివ్ ట్రస్టీ డాక్టర్ సర్వేపల్లి అజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మెగా రక్తదాన శిబిరం



నెల్లూరు (టౌన్): నగరంలోని కృష్ణచైతన్య డిగ్రీ కళాశాలలో మెగా రక్తదాన శిబిరాన్ని రెడ్‌క్రాస్ సహకారంతో శుక్రవారం నిర్వహించారు. ముఖ్యఅతిథులుగా హాజరైన కళాశాల డైరెక్టర్లు కృష్ణారెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, రాణాప్రమోద్‌రెడ్డి మాట్లాడారు. అకడమిక్ ప్రోగ్రామ్‌లో భాగంగా మెగా రక్తదాన శిబిరాలను ఏటా రెండుసార్లు నిర్వహిస్తున్నామని చెప్పారు. దాదాపు 250 యూనిట్ల రక్తాన్ని రెడ్‌క్రాస్ ప్రతినిధులు సేకరించారు. కళాశాల డీన్ సుధారాణి, రామాంజనేయరెడ్డి, ప్రిన్సిపల్ నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు సత్కారం



నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): ఫిలిప్పీన్స్‌లో నిర్వహించిన ఆసియన్ మాస్టర్స్ అథ్లెటిక్స్ మీట్‌లో పతకాలు సాధించిన కాటంరెడ్డి సునీత, జమునను శాంతినగర్‌లోని నిర్మల సౌధలో శుక్రవారం సత్కరించారు. అనంతరం స్వాతంత్ర్య సమర యోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి జయంతిని రెడ్ల ఐక్యవేదిక, మాస్టర్స్ అథ్లెటిక్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. మాస్టర్స్ అథ్లెటిక్స్ ఫెడరేషన్ అధ్యక్షుడు నిర్మల నరసింహారెడ్డి, కార్యదర్శి కోటేశ్వరమ్మ, వసుంధర, డాక్టర్ బీవీ రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పీడీఎస్‌యూ మహాసభల జయప్రదానికి పిలుపు


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నేతలు

నెల్లూరు(బారకాసు): నగరంలో డిసెంబర్ 15 నుంచి 17 వరకు నిర్వహించనున్న పీడీఎస్‌యూ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజశేఖర్ పిలుపునిచ్చారు. మహాసభలకు సంబంధించిన పోస్టర్లను ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడారు. మహాసభలకు రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి ప్రతినిధులు హాజరుకానున్నారని చెప్పారు. మూడు రోజుల పాటు వివిధ కార్యక్రమాలను నిర్వహించనున్నామని పేర్కొన్నారు. పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు సునీల్, నగర కార్యదర్శి వసీం, జిల్లా నేతలు చరణ్, వినోద్, నవీన్, సాయిదేవ్ తదితరులు పాల్గొన్నారు.

నేత్రపర్వంగా గరుడసేవ



నెల్లూరు(బృందావనం): చిలుక ద్వాదశిని పురస్కరించుకొని నగరంలోని తల్పగిరి రంగనాథస్వామి దేవస్థానంలో తిరుమంజనం, పూజలను విశేషంగా శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రంగడికి బంగారు గరుడసేవను నేత్రపర్వంగా జరిపారు. గోపురంవీధిలోని ఉత్తరాధి మఠానికి వేంచేశారు. అనంతరం రంగనాథుడు, తులసి అమ్మవారికి కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. ఈఓ ఉషా తదితరులు పాల్గొన్నారు.

కరువు మండలాలను ప్రకటించరూ..


జేసీకి వినతిపత్రమిస్తున్న సీపీఐ నేతలు

నెల్లూరు(దర్గామిట్ట): వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొంటున్న మండలాలను కరువుగా ప్రకటించి యుద్ధప్రాతిపదికన సహాయక చర్యలు చేపట్టాలని సీపీఐ నేతలు కోరారు. ఈ మేరకు జేసీ కూర్మనాథ్‌కు వినతిపత్రాన్ని శుక్రవారం అందజేసిన అనంతరం వారు మాట్లాడారు. ఆత్మకూరు, ఉదయగిరి, కందుకూరు, కావలి నియోజకవర్గాల్లోని దాదాపు అన్ని మండలాల్లో కరువుతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని, మేత లేక పశువులు ఇబ్బంది పడుతున్నాయని పేర్కొన్నారు. ఈ క్రమంలో వీరిని ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. సీపీఐ జిల్లా కార్యదర్శి అంకయ్య, నేతలు రామరాజు, షానవాజ్, రమణయ్య వెంకటేశ్వర్లు, బ్రహ్మయ్య పాల్గొన్నారు.

మేయర్‌కు శుభాకాంక్షలు



నెల్లూరు(బారకాసు): నగరపాలక సంస్థ పాలకవర్గం ఏర్పాటై రెండేళ్లు పూర్తయిన సందర్భంగా కార్పొరేషన్ కార్యాలయంలో వేడుకలను శుక్రవారం నిర్వహించారు. కార్యాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన భారీ కేక్‌ను విజయ డెయిరీ చైర్మన్ కొండ్రెడ్డి రంగారెడ్డి కట్ చేసి మేయర్ స్రవంతికి శుభాకాంక్షలను తెలియజేశారు. అనంతరం గజమాలతో వీరిని సత్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. నగరపాలక సంస్థ అభివృద్ధికి కృషి చేస్తున్న అధికారులు, సిబ్బందితో పాటు సహకరిస్తున్న ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో బడుగు, బలహీన వర్గాలకు న్యాయం జరుగుతుందనేందుకు తానే ఓ ఉదాహరణ అన్నారు. మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి, నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్ సహకారంతో నగరంలో వివిధ అభివృద్ధి పనులను పూర్తి చేస్తామని వెల్లడించారు.

యూనిఫారాల అందజేత



నెల్లూరు(సెంట్రల్): నగరంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ అవుట్‌సోర్సింగ్ సిబ్బందికి యూనిఫారాలను కమిటీ చైర్మన్ పేర్నేటి కోటేశ్వరరెడ్డి శుక్రవారం పంపిణీ చేశారు. మార్కెట్ కమిటీ అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఘన సన్మానం



నెల్లూరు(వీఆర్సీసెంటర్): మేయర్ స్రవంతిని కార్పొరేషన్ కార్యాలయంలోని ఆమె చాంబర్‌లో నేషనల్ ట్రైబల్ ఫెడరేషన్ నేతలు శుక్రవారం సత్కరించారు. మేయర్‌గా రెండేళ్ల పదవీ కాలాన్ని పూర్తి చేసుకున్న సందర్భంగా శుభాకాంక్షలను తెలియజేశారు. నేతలు దయాకర్, లోక్‌సాయి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

సచివాలయాల్లో తనిఖీ



నెల్లూరు(బారకాసు): నగరంలోని 17 / 1 వడ్డిపాళెం, 18 / 1 సాయినిలయంవీధి, 18 / 2, 3 కావేరినగర్ వార్డు సచివాలయాలను కమిషనర్ వికాస్ మర్మత్ శుక్రవారం తనిఖీ చేశారు. నోటీస్ బోర్డు, హాజరు, స్పందన, ఇన్‌స్పెక్షన్ రిజిస్టర్లతో పాటు వివిధ సంక్షేమ పథకాల రికార్డులను పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. పెండింగ్‌లో ఉన్న సేవలను నిర్ణీత గడువులోపు పూర్తి చేయాలని సూచించారు. ఎస్జీజీ, భూ హక్కు సర్వే, ఏపీ సేవా పోర్టల్ అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని పేర్కొన్నారు. స్పందన, జగనన్నకు చెబుదాం ఫిర్యాదులు, నాడు – నేడు పనుల పురోగతిపై దృష్టి సారించడంతో పాటు ఆస్తి పన్ను, యూజర్ చార్జీల వసూళ్లను వేగవంతం చేయాలని ఆదేశించారు. అనంతరం బారకాసు సమీపంలోని మహబూబ్‌ఖాన్ పార్కును సందర్శించారు. మాగుంట లేఅవుట్లోని లెక్చరర్స్ కాలనీలో అందిన ఫిర్యాదును కమిషనర్ పరిశీలించి తగు చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

వేదగిరిపై విశేష పూజలు



నెల్లూరు రూరల్: పవిత్రోత్సవాలను పురస్కరించుకొని నరసింహకొండపై వెలసిన వేదగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో విశేష పూజలను శుక్రవారం నిర్వహించారు. ఆగమ విద్వాన్ సత్యనారాయణాచార్యులు, ప్రధానార్చకుడు భాస్కరాచార్యులు, ఆలయ చైర్మన్ వేమిరెడ్డి సురేంద్రరెడ్డి, ఈఓ గిరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వెన్నెలకంటి రాఘవయ్యకు నివాళి



నెల్లూరు(వీఆర్సీసెంటర్): పద్మభూషణ్ వెన్నెలకంటి రాఘవయ్య వర్ధంతిని ఎన్టీఎఫ్ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. బోసుబొమ్మ సెంటర్‌లోని ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎన్టీఎఫ్ జిల్లా అధ్యక్షుడు చెంచయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి దయాకర్, నేతలు నవీన్, లోక్‌సాయి, శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, ఆదిమజాతి ట్రస్ట్ చైర్మన్ ప్రసాద్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

డయల్ యువర్ ఆర్‌ఎం నేడు

నెల్లూరు సిటీ: డయల్ యువర్ ఆర్‌ఎం కార్యక్రమాన్ని శనివారం నిర్వహించనున్నామని జిల్లా ప్రజా రవాణాధికారి శేషయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 0861 – 2325196 నంబర్‌కు సాయంత్రం నాలుగు నుంచి ఐదు గంటల్లోపు ఫోన్ చేసి సమస్యలు, సూచనలు, సలహాలను తెలియజేయాలని కోరారు.